బాలమిత్ర, మార్చి - 1996, జి. రామలక్ష్మి - హైదరాబాదు

**బాబా దర్శనం**

బాబా భక్తులు ఇద్దరు వ్యాపార నిమిత్తమై హైద్రాబాద్ నుంచి బొంబాయికి వెళ్ళారు. కాని, వాళ్ళు ఏ పని మీద అక్కడికి వెళ్ళారో ఆ పని అవటం లేదు. దాంతో వళ్ళకు చాలా చిరాగ్గా వుంది.

“డబ్బు ఖర్చయిపోతోందే కానీ పనులు మాత్రం ఒక్కటీ జరగటంలేదు. ఏం చేద్దాం?” అన్నాడు చిరాకుపడుతూ రమణ అనే అతను సునీల్‌తో.

“అవును, అదే నాకూ అర్థంకాకుండా వుంది. నేనూ అదే ఆలోచిస్తున్నాను” అంటూ ఆలోచించసాగాడు సునీల్.

కాసేపటికి రమణ, “ఇక్కడ మన పనులన్నీ సక్రమంగా పూర్తయితే కనక ఇక్కడి నుంచి షిరిడీకి వెళ్ళి బాబా దర్శనం చేసుకుని, ఓ రెండు మూడు రోజులు బాబా సన్నిధిలో గడిపి యిళ్ళకు వెళ్దాం సరేనా?” అన్నాడు.

దానికి సునీల్ భృకుటి ముడిచి “అదో మొక్కా యిప్పుడు. నీ చాదస్తం కానీ బాబా దర్శనం చేసుకుంటామన్నంతలో ఇక్కడ మన పనులు సులువుగా అయిపోతాయా ఏం? యిప్పటికే డబ్బు మంచినీళ్ళ లాగా ఖర్చయిపోయింది. పైగా అదో ఖర్చు దండగ కూడానా?” అన్నాడు విసుగ్గా.

“తప్పురా బాబాని, ఆయన దర్శనాన్నీ చిన్నచూపు చూడకురా. ఆయన భగవంతుని అవతారం. దర్శనమాత్రంలోనే చిరాకులు, చింతలు పోయి, అదృష్టం ఐశ్వర్యం కలిసి వస్తాయి. నా మాట విని సరే అను” అంటూ వత్తిడి చేసాడు.

ఇష్టంలేకున్నా సునీల్ “సరే! నీ పిచ్చి నీకానందం… అలాగే కానీ” అన్నాడు.

ఆ తర్వాత నాలుగు రోజుల్లో వాళ్ళ పనులు అనుకున్న దానికన్నా సులభంగా, సునాయాసంగా అయిపోయి, అనుకున్నదానికన్నా ఎక్కువ లాభమే వచ్చింది. ఆ తర్వాత వాళ్ళు షిరిడీకి వెళ్ళారు. బాబా దర్శనం చేసుకున్నారు.

బాబా నవ్వి "ఎందుకు నాయనా ఇంత దూరం వచ్చావు - డబ్బు ఖర్చు చేసుకుని, నా దర్శనం వలన నీకు కలిగే లాభమేమిటి? పైపెచ్చు డబ్బు దండగ, అనవసరపు ఖర్చు" అన్నారు నవ్వుతూ.

సునీల్ అది విని ఖంగుతిని, అవి తనన్న మాటలేకదా బాబాకి ఎలా తెలిసాయి అని మనసులో అనుకుని - "క్షమించండి బాబా! మీ దర్శనం విలువ తెలియక అలా అన్నాను" అంటూ పాదాలపై వాలాడు.

బాబా నవ్వి అతనిని లేవదీసి, "వెంటనే హైద్రాబాద్‌కి వెళ్ళిపో" అన్నారు.

సునీల్ "అదేంటి బాబా! అలా అంటున్నారు? మేము రెండు మూడు రోజులు ఉందామనే నిర్ణయించుకుని వచ్చాము" అన్నాడు.

"మీ నిర్ణయం ఉంటే చాలా? నా నిర్ణయం అక్కర్లేదా? మళ్ళీ రెండు నెలలు ఆగి వద్దువుగాని, వెంటనే ఈ రాత్రి బస్సుకే వెళ్ళిపో" అన్నారు.

ఇక చేసేదిలేక వాళ్ళిద్దరూ అలాగే హైద్రాబాద్‌కి వచ్చేసారు.

తీరా సునీల్ ఇంటికి వచ్చేసరికి - అతని భార్యని కడుపునొప్పని పక్కింటివాళ్ళు ఆసుపత్రిలో చేర్పించటం జరిగింది. ఎపెండిసైటిస్‌గా డాక్టర్లు నిర్ణయించి ఆపరేషన్ చేసారు సునీల్ అనుమతితో.

'ఓ గంట ఆలస్యమైతే ఆమె ప్రాణానికే ముప్పని' డాక్టర్లు చెప్పారు.

ఆపరేషన్ సక్రమంగా జరిగి ఆమె ఆపద నుండి బయటపడిరది.

ఆ తర్వాత సునీల్ అనుకున్నాడు - బామా ఎందుకు తనను వెంటనే హైద్రాబాద్‌కి వెళ్ళిపొమ్మన్నదీ, తన భార్య ప్రాణాపాయ స్థితిలో ఉన్నదనేగా అని అనుకుంటూ, ఆ తర్వాత రెండు నెలలకి ఆమె కొలుకోగానే ఆమెని తీసుకుని షిరిడీకి వచ్చి బాబా దర్శనం చేయించి జరగింది చెప్పాడు.

బామా చిరునవ్వు నవ్వారు వాళ్ళని దీవిస్తూ.